టీబీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా టీబీ వ్యాధి నిరోధక అధికారి అరుణకుమారి

ఆమనగల్లు, మార్చి 13: టీబీ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా టీబీ వ్యాధి నిరోధక అధికారి అరుణకుమారి సూచించారు. ఆమనగల్లు మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను బుధవారం జిల్లా టీబీ వ్యాధి నిరోధక అధికారి అరుణకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీబీ వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వ్యాధిగ్రస్తులకు సకాలంలో మందులు అందజేయటంలో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. మందులు సక్రమంగా వేసుకుని వ్యాధిని పూర్తిగా అరికట్టుకోవాలని ఆమె సూచించారు. ఈ తనిఖీలో ప్రభుత్వ వైద్యాధికారి పరిక్షీత్ నరేందర్, టీబీ సూపర్‌వైజర్ విజయ్, ప్రభుత్వ దవాఖాన సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఉన్నారు.

సాగు భూముల్లో ఫార్మా కంపెనీలు వద్దు

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌నాయక్


హకీంపేటలో రైతులతో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

బొంరాస్‌పేట, మార్చి 13 : రైతులు సాగు చేసుకుంటున్న సాగు భూముల్లో ప్రభుత్వం ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయడం సరికాదని లంబాడా హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ అన్నారు. బుధవారం వారు దుద్యాల మండలం పోలేపల్లి, హకీంపేట, లగచెర్ల, పులిచెర్లకుంటతండాల్లో పర్యటించి రైతులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం ఫార్మా విలేజ్ ఏర్పాటు చేస్తుందని, ఇందుకు నాలుగు గ్రామాల రైతులకు చెందిన 12 వందలకుపైగా ఎకరాల భూములను ప్రభుత్వం ఫార్మా కంపెనీల ఏర్పాటుకు తీసుకోవడానికి ప్రయత్నిస్తుండడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారని వారు పేర్కొంటున్నారు. రైతుల వద్ద నుంచి సాగు భూములు లాక్కొంటే జరిగే పరిణామాలకు కాంగ్రెస్ ప్రభుత్వమే దానికి బాధ్యత వహించాలని వారు హెచ్చరించారు. ఫార్మా విలేజ్ ఏర్పాటుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భద్రూనాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కేశ్యానాయక్, సోషల్ మీడియా ఇన్‌చార్జి అరుణ్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురికి జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి13 (నమస్తే తెలంగాణ): స్నేహితులతో కలిసి జల్‌పల్లి చెరువు ప్రాంతానికి వెళ్లిన మహిళ, ఆమె స్నేహితుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురు నిందితులకు ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 5,500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉషాక్రాంతి తీర్పునిచ్చారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె.గోపాల్ కథనం ప్రకారం.. మీర్‌పేట ప్రాంతానికి చెందిన యువతి తన ఇద్దరు స్నేహితులతో కలిసి 2017, జూన్ 28న సాయంత్రం జల్‌పల్లి చెరువు వద్ద వెళ్లింది. అదే ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్స్ హబీబ్ హుస్సేన్(27), మొయిన్ ఖాన్(26), మహ్మద్ అజార్ షరీఫ్(29) కలిసి యువతి వద్దకు వెళ్లి.. వారి ఫొటోలు తీసి, బెదిరించి డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేశారు. బలవంతంగా యువతి, ఆమె ఇద్దరు స్నేహితుల వద్ద నుంచి సెల్‌ఫోన్స్, నగదును తీసుకుని యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. జరిగిన ఘటనపై బాధిత యువతి పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయస్థానం.. ముగ్గురు నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలి

ప్రచార సరళి, ఎన్నికల వ్యయాన్ని నిశితంగా పరిశీలించాలి

నిఘా బృందాలకు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ దిశానిర్దేశం

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

రంగారెడ్డి, మార్చి 13(నమస్తే తెలంగాణ): ఎన్నికల విధులను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. రానున్న పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకుని స్టాటిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర నిఘా బృందాల అధికారులకు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయా పార్టీలు, అభ్యర్థుల ప్రచార సరళి పరిశీలన, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీల నిర్వహణ తదితర అంశాలపై ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో నిఘా బృందాలు సమర్థవంతంగా, నిబద్ధతతో తమ బాధ్యత నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను తప్పకుండా పాటించాలని, అన్ని పార్టీలు, అభ్యర్థుల పట్ల నిబంధనలకు అనుగుణంగా సమదృష్టితో వ్యవహరించాలన్నారు. వివక్షను ప్రదర్శించారనే ఫిర్యాదులు రాకుండా పక్కాగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ జరుగకుండా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా వాస్తవాలను నిర్ధారించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిఘా బృందాల దృష్టిని మళ్లించేందుకు పలువురు చేసే తప్పుడు ఫిర్యాదుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, అలాంటి వాటిపై తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల వ్యయం, ప్రచార సరళిపై నిఘా బృందాలు 24 గంటలు నిఘా ఉంచాలని, ఈ మేరకు పూర్తి స్థాయిలో బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్టాటిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర బృందాలకు సమకూర్చిన వాహనాలకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన వీటీజీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా నిఘా బృందాల పనితీరును కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. తనిఖీల సమయంలో సాధారణ ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా సంయమనంతో వ్యవహరించాలని, నగదును జప్తు చేసిన సందర్భాల్లో తగు రీతిలో పంచనామా నిర్వహించి తప్పనిసరిగా రశీదులు అందించాలని సూచించారు. తగిన ఆధారాలను చూపించి నగదును విడిపించుకునే వెసులుబాటు ఉంది అనే విషయాన్ని బాధితులకు వివరించాలన్నారు. ఆయా పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన రేట్ కార్డును అనుసరిస్తూ లెక్కింపు చేయాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో డీఆర్‌వో సంగీత, ఎన్నికల వ్యయం నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి, ఎంసీసీ నోడల్ అధికారి సీపీవో సౌమ్య, సంబంధిత టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్‌యూ వ్యవస్థాపక అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం

ఆర్ఎస్‌యూ వ్యవస్థాపక అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి

కొడంగల్, మార్చి 13 : విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ రంగ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ చేయడంతో పాటు చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్, కాస్మటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీగా ఉన్న వార్డన్, కుక్, కమాటి, నైట్ వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రతి విద్యాసంవత్సరం ప్రారంభంలో మెయింటెనెన్స్ ఖర్చుల కింద సంక్షేమ హాస్టల్‌కు రూ.50వేలు అందించాలని కోరారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, చదువుల పేరుతో దోపిడీ చేస్తున్నట్లు ఆరోపించారు. అటువంటి కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని తెలిపారు. జిల్లాలో పదివేల మందికి ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం 9 మందితో కూడిన నూతన ఆర్ఎస్‌యూ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడిగా బీమరాజు, ప్రధాన కార్యదర్శిగా సురేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా బాలరాజ్‌గౌడ్, ప్రభాకర్, సహాయ కార్యదర్శులుగా రమేశ్, కేశవులు, శ్రీకాంత్, కోశాధికారిగా బి. చంద్రశేఖర్‌లు ఎన్నుకోబడ్డారు.

ఘనంగా గోమాతకు సీమంతం

షాబాద్, మార్చి 13: షాబాద్ మండలంలోని సీతారాంపూర్ గ్రామంలోని శ్రీ సీతారామ కుటీరంలో జోషి గాయత్రి ఆధ్వర్యంలో బుధవారం గోమాతకు మహిళలందరూ ఘనంగా సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి జోషి గాయత్రి మాట్లాడుతూ.. ప్రకృతిలోని జీవులతో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ భారతీయ సాంప్రదాయంలో ప్రత్యేక స్థానంలో ఉన్న గోవుకు తమ కుటుంబం అత్యంత ఘనంగా సీమంత వేడుకలు నిర్వహించడం జరిగిందన్నారు. స్త్రీ మరో జీవికి ప్రాణం పోసే ముందు క్షేమాన్ని కాంక్షిస్తూ హిందూ సంస్కృతిలో జరిపే ముఖ్య ఘట్టం సీమంతం అని తెలిపారు. తల్లి, పుట్టబోయే శిశువు క్షేమాన్ని దీర్ఘాయుస్సుని కోరుతూ జరిపించే సాంప్రదాయ వేడుకని చెప్పారు. సర్వ సాధారణంగా గర్భవతికి 5వ నెల గాని, 9వ నెలలో గానీ సీమంతం జరుపుతుంటారన్నారు. సాధారణంగా మహిళలకు సీమంతం జరపడం ఆనవాయితీ అయితే కొంతకాలంగా తమ పెంపుడు జంతువులు గర్భం దాలిస్తే సీమంతం జరిపిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జోషి మధుకర్, గాయత్రి, సాయి, ప్రజ్ఞా, విశాల్ శర్మ, గోభక్తులు పాల్గొన్నారు.


గోమాతకు సీమంతం కార్యక్రమం నిర్వహిస్తున్న జోషి గాయత్రి, మహిళలు

ఇటుక బట్టీల్లో .. బంధీ అవుతున్న బాల్యం

- చదువులకు దూరంగా చిన్నారులు
- చిన్నారులతో ఇటుక బట్టీల్లో పనులు చేయిస్తున్న యజమానులు
- ఇప్పటికైనా వారిని గుర్తించి బడుల్లో చేర్పించాలని కోరుతున్న స్థానికులు
- అధికారులు స్పందించి చిన్నారులకు పనుల నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్న వైనం

పెద్దేముల్, మార్చి 13 : ఇటుక బట్టీల్లో చిన్నారుల బాల్యం బుగ్గి అవుతుండగా ఆ చిట్టి తల్లుల చిట్టి చేతులు చక్కని రాతలకు, చదువులకు దూరమవుతున్నాయి. చేతిలో బలపం పట్టి చదువుకోవాల్సిన చిన్నారులు అదే చేతులతో ఇటుకలు మోస్తూ చదువులకు దూరం అవుతూ బట్టీల్లోనే మగ్గిపోతున్నారు. చాలీచాలని జీతాలు చెల్లించి కార్మికుల శ్రమను యజమానులు దోచుకోవడంతో పాటు చిన్నారులను శ్రమ జీవులుగా మార్చి వేస్తున్నారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి... వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలంలోని ఇటుక బట్టీల్లో జీవనోపాధికోసం ఇటుక బట్టి కార్మికులు పొట్ట కూటికోసం వలసలు వచ్చిన కార్మికుల పిల్లలు సమాజానికి దూరంగా ఉంటూ ఇటుక బట్టీల్లోనే పని చేసుకుంటూ బట్టీల లోనే మగ్గుతున్నారు. తల్లిదండ్రుల పేదరికాన్ని ఆసరాగా చేసుకొని ఇటుక బట్టి యజమానులు సైతం వారి పిల్లలతో కూడా పని చేయిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. వారికి అందించాల్సిన కనీస సౌకర్యాలు కూడా అందించకుండా బాల కార్మికులుగా రూపాంతరం చెంది వారి జీవితాలను చీకటిమయం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇటుక బట్టీల్లో ఉన్న కూలీల పిల్లలను గుర్తించి బాలకార్మిక వ్యవస్థ నుంచి విముక్తి కల్పించి వారిని బడిలో చేర్పించి ఆ చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపాలని పలువురు కోరుతున్నారు. ఏది ఏమైనాప్పటికీ మండలంలో ఉన్న వివిధ రకాల పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, ఇటుక బట్టీల్లో ఉన్న పిల్లలను సంబంధిత అధికారులు తక్షణమే గుర్తించి వారికి చదువుల పరంగా న్యాయం చేయాలని, వివిధ రకాల పనుల చెర నుంచి వారిని విడిపించి చదువులకు దగ్గరగా చేసి బడుల్లో చేర్చాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తాం

ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు రాఘవేందర్

జ్ఞానేశ్వర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జిల్లా ముదిరాజ్ సంఘం సభ్యులు

నవాబుపేట, మార్చి13: బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం పార్లమెంట్ అభ్యర్థి కాసానీ జ్ఞానేశ్వర్‌ను జిల్లా ముదిరాజ్ సంఘం, చేవెళ్ల నియోజకవర్గ నాయకుడు తెలుగు రాఘవేందర్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ గణేశ్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, తెలుగు శ్రీను ముదిరాజ్, సాయి కురుమ్మ, రాజ్ ముదిరాజ్‌లు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తెలుగు రాఘవేందర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ముదిరాజ్‌ల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేసిందని, ఈ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అధినేత కేసీఆర్‌కు అండగా నిలుస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలా ముందుకెళ్లాలి, ప్రతిపక్ష పార్టీలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై చర్చ జరిగినట్లు రాఘవేందర్ తెలిపారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

మన్సూరాబాద్, మార్చి 13: ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో ఈ నెల 10న జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. భర్తే ఆమెను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 10న తెల్లవారుజామున రాచకొండ పోలీస్ కమిషనరేట్ క్యాంపు కార్యాలయం సమీపంలోని ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న ఈ చలాన్ కాంపౌండింగ్ బూత్ వద్ద భిక్షాటన చేసుకునే మహిళ దారుణ హత్యకు గురైంది. మార్నింగ్ వాక్‌కు వెళ్లే ఓ వ్యక్తి రక్తపు మడుగులో ఉన్న మహిళను చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడి చేరుకున్న పోలీసులు, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం బృందాలు ఆధారాలను సేకరించాయి. మహిళ హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బిక్షాటన చేసిన అనంతరం ప్రతి రోజు సదరు మహిళతో పాటు మరో వ్యక్తి ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న ఈ చలాన్ కాంపౌండింగ్ బూత్ వద్ద రాత్రి వేళ నిద్రించే వారని పోలీసులు గుర్తించారు. సదరు మహిళ హత్య తర్వాత ఆ వ్యక్తి కనిపించలేదు. అతడిని పట్టుకునేందుకు ఆరు పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. బుధవారం ఉదయం ఓ వ్యక్తి ఎల్బీనగర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా.. పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. దీంతో ఈనెల 10వ తేదీన మహిళను హత్య చేసిన విషయం బయటపడింది. హత్య చేసిన వ్యక్తి తుసమ్మరే బసంత్ సింగ్ అని తేలింది. కొన్ని రోజులుగా తన భార్య జ్యోతి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉన్నదని, దీంతో పాటు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆగ్రహంతో కత్తితో మెడకోసి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో అతడు తెలిపాడు. నిందితుడిపై ఐపీసీ 302 సెక్షన్ కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

15, 16వ తేదీల్లో.. తెలుగు జాతీయ సదస్సును జయప్రదం చేయండి

సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్నప్రభ, అధ్యాపకులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న ప్రభ

హయత్‌నగర్, మార్చి 13: ఈ నెల 15, 16వ తేదీల్లో హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యంతో.. 'తెలంగాణ అస్తిత్వ పోరాట సాహిత్యం– సమాలోచన' అనే అంశంపై రెండు రోజుల పాటు తెలుగు జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ కళాశాల విద్యశ్రీ బుర్రా వెంకటేశం, ఇతర అధికారులను ఆహ్వానించామని వెల్లడించారు. తెలంగాణలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఇతర కళాశాలల నుంచి ఎందరో అధ్యాపకులు పత్ర సమర్పణ చేయనున్నారని తెలిపారు. ఈ సన్నాహక కార్యక్రమాల్లో డాక్టర్ కె.సురేశ్, డాక్టర్ ఈ.శంకర్, డాక్టర్ రాకేశ్ భవాని, డాక్టర్ గంజి శశిధర్, డాక్టర్ బి.రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

మొయినాబాద్, మార్చి13: ప్రభుత్వ భూమి కబ్జాకు గురై అక్రమంగా నిర్మాణాలు వెలుస్తున్నాయని అందిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేసేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది విధులకు కొందరు ఆటంకం కలిగించారని తహసీల్దార్ గౌతంకుమార్ ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చిలుకూరు రెవెన్యూలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 277ను ఆనుకుని ప్రైవేట్ భూమి ఉంది. ప్రైవేట్ భూమిని కొనుగోలు చేసిన వారు ప్రభుత్వ భూమిని కలుపుకుని వెంచర్ చేశారు. ప్రభుత్వ భూమిలో వేసిన ప్లాట్లు కూడా విక్రయించాడు. అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయని చిలుకూరు గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ గౌతంకుమార్, తమ సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం సురభి వెంచర్‌లోకి వెళ్లి ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఇంటి నిర్మాణం చేస్తున్న సదరు వ్యక్తి మేకల కల్యాణ్‌చక్రవర్తిని తహసీల్దార్ ప్రశ్నించగా, కళ్యాణ్ చక్రవర్తితో పాటు అతడి భార్య, సహచరులు కలిసి తహసీల్దార్‌తో పాటు వారి సిబ్బందిని అడ్డుకుని విధులకు ఆటంకం కలిగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

లారీ కింద పడి.. డెలివరీ బాయ్ మృతి

శేరిలింగంపల్లి, మార్చి 13: వెనుక నుంచి వస్తున్న లారీ కిందపడి జెప్టో డెలివరీ బాయ్ దుర్మరణం పాలయ్యాడు. ఈ ప్రమాదం రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీజారెడ్డి కథనం ప్రకారం.. లంగర్‌హౌస్ నివాసి ఎరుకల ఆంజనేయులు (26) జెప్టోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో అతడు బైక్‌పై గచ్చిబౌలి జంక్షన్ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తున్నాడు. గచ్చిబౌలిలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ముందు వెనుక నుంచి ఆక్సిజన్ సిలిండర్ల లోడ్‌తో వస్తున్న లారీ కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే బేగంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులు నూతనంగా ఏర్పాటు చేసిన లాజిస్టిక్ కౌంటర్

నేడు లాజిస్టిక్ కౌంటర్ ప్రారంభం

దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌లో..

ఎల్బీనగర్, మార్చి 13: దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లాజిస్టిక్ కౌంటర్‌ను గురువారం ప్రారంభించేందుకు సిద్ధం చేశారు. ప్రస్తుతం అన్ని రకాల పార్సిల్స్‌ను చేర వేస్తున్న ఆర్టీసీ సంస్థ.. తన సేవలను మరింత విస్తరించి ప్రజల్లోకి వెళ్లేలా చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు లాజిస్టిక్ విభాగానికి కొత్త లోగోను, బ్రోచర్‌ను తయారు చేశారు. గురువారం ఉదయం పది గంటల పదిహేను నిమిషాలకు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌లో నూతన లాజిస్టిక్ కౌంటర్‌ను ప్రారంభించి, లాజిస్టిక్ లోగోను, బ్రోచర్‌ను ఆవిష్కరించనున్నారని దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్– 2 డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎండీ సజ్జనార్‌తో పాటుగా ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి డాక్టర్ రవీందర్, ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

మెట్రో స్టేషన్లలో మౌలిక వసతులు

సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ): మెట్రో స్టేషన్‌లో మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టింది. నగరంలో మొదటి దశలో 3 కారిడార్లలో చేపట్టిన మెట్రో ప్రాజెక్టులో భాగంగా మెట్రో స్టేషన్లలో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఆధునికంగా, పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా.. కారిడార్–1 (మియాపూర్– ఎల్బీనగర్) లోని భరత్ నగర్, మియాపూర్ మెట్రో స్టేషన్ల కింద భాగంలో ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. ప్రధానంగా.. భరత్‌నగర్ మెట్రో స్టేషన్ కిందనే కూరగాయల మార్కెట్ ఉండటంతో ప్రయాణికులు తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థగా అందుబాటులోకి వచ్చిన మెట్రో స్టేషన్లలో మౌలిక వసతులకు ప్రాధాన్యతనిస్తున్నారు. మియాపూర్ మెట్రో స్టేషన్‌లో ఎడమ వైపు విలేజ్ జోన్ పరిరక్షణ చర్యలు చేపడుతున్నామని మెట్రో అధికారులు తెలిపారు.